క్లుప్తంగా

వీల్ చైర్ అందజేత


వీల్‌చైర్ అందజేస్తున్న సీఐ కుమార్

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని మహాలక్ష్మివీధికి చెందిన దివ్యాంగుడు మడకం శ్రీనుకు పోలీస్‌శాఖ సహకారంతో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం సీఐ బండారి కుమార్ వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతి రావు, ఆంజనేయులు, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ


కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని సూరవీడు గ్రామ పంచాయతీ కొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై కొప్పుల తిరుపతి రావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం, వాజేడు మండలం నుంచి వచ్చి, పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపివేశారు. ఈ తనిఖీల్లో ఆంజనేయులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

బతుకమ్మ విగ్రహావిష్కరణ


బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సురేష్

మంగపేట : మండలంలోని కమలాపురం ఇంటెక్‌వెల్ వద్ద గోదావరి ఒడ్డున నూతనంగా నిర్మించిన బతుకమ్మ విగ్రహాన్ని పంచాయతీ స్పెషలాఫీసర్ రసపుత్ర సురేష్, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు బతుకమ్మ ఆడేందుకు ప్రత్యేక ఆటస్థలాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తుల కోరిక మేరకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.2లక్షల రూపాయల జనరల్ ఫండ్ వ్యయంతో ప్రత్యేక ఆటస్థలం, బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పీటీసీ గుమ్మడి సోమయ్య, చింతా పున్నారావు, సాంబిరెడ్డి, నిమ్మల రాంబాబు, పెద్ది నర్సింహారావు, భగవాన్‌రెడ్డి, చంద్రావతి, లింగంపెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

టేకుమట్ల : మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ గురువారం దసరా పండుగ సందర్భంగా దుస్తులను పంపిణీ చేశారు.

ఏటూరునాగారం: బొడ్రాయి వద్ద బతుకమ్మలతో వస్తున్న మహిళలు


గోవిందరావుపేట: చల్వాయిలో..


గోవిందరావుపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


తీరొక్కపూల జాతర

ఘనంగా సద్దుల బతుకమ్మ ◆ గంగమ్మ చెంతకు గౌరమ్మ ◆ జంపన్నవాగు, గోదావరిలో నిమజ్జనం


ఏటూరునాగారం: రామాలయంలో..


గోవిందరావుపేట: పస్రా రెడ్డి బజారులో..


గోవిందరావుపేట: పస్రా కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బతుకమ్మ ఆడుతున్న మహిళా పోలీసులు


మంగపేట: బతుకమ్మలతో వస్తున్న మహిళలు

ములుగు రూరల్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ వేడుకలను తీరొక్క పూలతో పేర్చి మహిళలు ఘనంగా నిర్వహించారు. గురువారం సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చి పసుపు గౌరమ్మ చేసి పూజలు నిర్వహించి అనంతరం సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వెంకటాపురం(కె) : మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు ఎదిర, సూరవీడు, రామచంద్రాపురం, ఉప్పేడు, బర్లగూడెం, ఆలుబాక, పాత్రాపురం, మరికాల, బెస్తగూడెం గ్రామాల్లో మహిళలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు ఉదయమే స్నానాలు చేసి రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి సాయంత్రం గ్రామ కూడళ్ల, దేవాలయాలకు వెళ్లి ఆడిపాడారు.

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయిల వద్దకు డప్పు చప్పుల తో మహిళలు బతుకమ్మలను తీసుకువచ్చి ఆడిపాడారు. వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం చెరువుల్లో, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పోయిరా గౌరమ్మ..వెళ్లి రావమ్మా అంటూ సాగనంపారు.

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెం ,చింతగూడెం, సింగారం, కన్నాయిగూడెం, రాజన్నపేట, గుర్రేవుల, లక్ష్మీపురం, తుపాకులగూడెం గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రకృతిలో లభించే తీరొక్కపూలను సేకరించి బతుకమ్మలు తయారు చేశారు.

సద్దుల బతుకమ్మ వేడుకలు

ఏటూరునాగారం : ఏజెన్సీలో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. చిన్న,పెద్ద తేడా లేకుండా ప్రతి ఇంటి నుంచి బతుకమ్మను పేర్చి మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం వద్దకు చేరుకొని ఆడిపాడారు. అలాగే బొడ్రాయి, శివాలయం, ముత్యాలమ్మవీధి, క్రాస్‌రోడ్డు, ఆకులవారిఘణపురం, శంకరాజుపల్లి, రొయ్యూర్, తదితర గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు జరిగాయి. తీరొక్క పువ్వులతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను ఆలయాల వద్దకు చేర్చారు. బతుకమ్మ పాటలకు కోలాట నృత్యాలు వేస్తూ సంతోషంగా గడిపారు. అనంతరం జంపన్నవాగు, గోదావరి నదిలో బతుకమ్మను నిమజ్జనం చేసి పోయిరా గౌరమ్మ..పోయిరా అంటూ వేడుకున్నారు. సత్తుపిండి, పిండి పదార్థాలను అందరికి పంపిణీ చేశారు.

గోవిందరావుపేట : మండలంలోని ఆయా గ్రామాల చెరువులు, వాగుల వద్ద బతుకమ్మ నిమజ్జనానికి అధికారులు భారీ ఏర్పాట్లు చేయడంతో మహిళలు సద్దుల బతుకమ్మ ఆడి ప్రశాంతంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆడపడుచుల ఆటపాటల వద్ద పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

సంబురంగా సద్దులు..

మంగపేట : మండలంలోని మంగపేట, కమలాపురం, మల్లూరు, తిమ్మంపేట, చెరుపల్లి, నర్సింహాసాగర్, రాజుపేట తదితర గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబురాలు గురువారం అంబరాన్నంటాయి. బతుకమ్మ ఆటస్థలాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై టీవీఆర్ సూరి, మంగపేట, కమలాపురంలో గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

వాజేడు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువరం సద్దుల బతకమ్మ పండుగను వైభవంగా నిర్వహించారు. ఫ్లతో భరీ ఎత్తున పేర్చిన బతుకమ్మలను మేళతాళాలతో ఇంటి నుంచి బతుకమ్మ గద్దెల వరకు తీసుకు వెళ్లారు. బతుకమ్మలను గద్దెల చుట్టు పెట్టి ఆట పాటలతో అలరించారు.


గోవిందరావుపేట: బందోబస్తు నిర్వహిస్తున్న పస్రా ఎస్సై


ములుగు రూరల్ : బతుకమ్మలతో బయలుదేరిన మహిళలు


గోవిందరావుపేట: చల్వాయిలో బతుకమ్మ ఆడేందుకు వెళ్తూ..


ఏటూరునాగారం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఏటూరునాగారం: రామాలయానికి వస్తున్న మహిళలు


బతుకమ్మలతో తరలి వస్తున్న మహిళలు, యువతులు


ములుగు రూరల్: మల్లంపల్లిలో..


ములుగు: ఒగ్గు డోలు విన్యాసాలు


మంగపేట: బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు


మంగపేట: గోదావరి ఒడ్డున బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ములుగు: తోపుకుంటలో..

బంజారాల సంస్కృతికి ప్రతీక తీజ్


మల్హర్ : తీజ్ బుట్టలతో యువతులు, మహిళలు

భూపాలపల్లి రూరల్ : బంజారాల సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి మండల పరిధిలోని కమలాపూర్, గొల్లబుద్దారం గ్రామాల్లో జరిగిన లంబాడీ, బంజారాల తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తీజ్ వేడుకల్లో లంబాడీలంతా ఏకతాటి పైకి వచ్చి ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు పలువురు శాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు పాల్గొన్నారు.

అడ్వాలపల్లి గ్రామంలో..

మల్హర్ : బంజారాల సంస్కృతికి ప్రతీక అయిన తీజ్ పండుగను మండలంలో అడ్వాలపల్లి గ్రామంలో మహిళలు, యువతి, యువకులు, తండావాసులు గురువారం ఘనంగా నిర్వహించారు.గిరిజనులు తమ సాంప్రదాయ పద్ధతిలో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసి తీజ్ ఉత్సవాన్ని జరుపుకున్నారు. బంజారా, లంబాడీ సంస్కృతీ, సంప్రదాయానికి చాటి చెప్పే పండుగలలో అతి ముఖ్యమైనది తీజ్ పండుగ. తీజ్ అనగా గోధుమ మొలకలని, అవి అమ్మవారి ప్రతీరూపాలని తండావాసులు పేర్కొన్నారు. తీజ్ ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులుగా యువతులు ఎంతో నియమ నిష్టలతో మొలకలను బుట్టలలో పెంచుతారని వివరించారు. తొమ్మిది రోజుల అనంతరం యువతులు గోధుమ బుట్టలను ఎత్తుకొని, డప్పు చప్పుళ్లతో పాటలు పాడుతూ పూజలు చేశారు. అనంతరం తండాలోని చావిడి వద్ద ఏర్పాటు చేసిన తీజ్ బుట్టల పందిరి వద్ద యువతి, యువకులు నృత్యాలతో ఆడిపాడుతూ స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. భూక్య గోపి నాయక్, అజ్మీరా ఆకిరాం నాయక్, మాజీ సర్పంచ్ బానోత్ రాజు నాయక్, అజ్మీరా బాలాజీ నాయక్, తండావాసులు ఉన్నారు.

అంబులెన్స్‌ల తనిఖీ


1962 వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి నియోజకవర్గంలోని పశు సంవర్ధకశాఖకు చెందిన 1962 సంచార పశు వైద్యశాల అంబులెన్స్‌ను తెలంగాణ రాష్ట్ర పశు వైద్య శాఖ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ భగేష్ మిశ్రాతో పాటు108, 102, 1962 వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ భూపాలపల్లిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. అదేవిధంగా సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. మూగ జీవాలకు తగిన మెరుగైన వైద్యం అందిస్తూ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేనేజర్ మెరుగు నరేష్, పారవేట్ రమేష్, పైలట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో ఇసుక క్వారీ నుంచి తరలిస్తున్న లారీల వద్ద సర్పంచ్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వారిపేరుతో ఎందుకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

మొగుళ్లపల్లి : ట్రాక్టర్ ట్రాలీ దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు చిట్యాల సీఐ మల్లేష్, స్థానిక ఎస్సై అశోక్ తెలిపారు. సీఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గణేశ్‌పల్లె గ్రామానికి చెందిన వల్లాల రాజునారాయణ ట్రాక్టర్ ట్రాలీని గత ఫిబ్రవరిలో తన వ్యవసాయ పొలం వద్ద ఉంచగా అపహరణకు గురైంది. దీంతో ట్రాలీ యజమాని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం కొర్కిశాల గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బద్దంపల్లి గ్రామానికి చెందిన యాళ్ల చిరంజీవి ట్రాక్టర్‌లో ఇసుక లోడుతో వెళ్తుండగా ట్రాలీకి సంబంధించిన పత్రాలు సరిగా లేకపోవడంతో అనుమానం వచ్చిన దర్యాప్తు చేశారు. ట్రాక్టర్ ట్రాలీని దొంగిలించినట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి ట్రాలీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

వ్యాపారస్తులకు మార్గదర్శి రతన్ టాటా


రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

ఏటూరునాగారం : వ్యాపారస్తులకు మార్గదర్శకుడు రతన్ టాటా అని ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పొదెం కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి రతన్ టాటా మృతిచెందడంతో గురువారం మండల కేంద్రంలోని వైజంక్షన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండలం ఆకులవారిగణపురం కుమ్రం భీం జంక్షన్‌లో వ్యాపార దిగ్గజం రతన్ నవల్ టాటాకు సంతాపం తెలియజేశారు. రతన్ టాటా దూరదృష్టి కలిగిన వ్యాపారవేత అని, భారతదేశ అభివృద్ధికి తోడుపడినటు వ్యక్తి ఆయన కొనియాడారు. బలహీన వర్గాల వారికి విద్యా, వైద్యం కోసం తన సంపాదనలో సగభాగం కేటాయించే వారని, అందరికీ ఆప్తుడయ్యాడని చెప్పారు.దేశంలో వ్యాపార సంస్థలకు స్థిరమైన నాయకత్వ లక్షణాలను అందించి వారికి మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు.కార్యక్రమంలో కోటి రవి, నల్లబోయిన కోటయ్య, చందా మహేష్, నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు అభినందనలు

భూపాలపల్లి : మండలంలోని గోర్లవీడు గ్రామానికి చెందిన ఎనిమిది మంది అభ్యర్థులు డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. కాగా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామస్తులు, హెల్పింగ్ హ్యాండ్ యూత్ సభ్యులు సన్మానించి అభినందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు మందల రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మందల సాగర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తాటికంటి శంకర్, హెల్పింగ్ హ్యాండ్స్ టీం సభ్యులు తోట విష్ణు, రాజపాల్ రెడ్డి, గోపు సునీల్ రెడ్డి, చీదురాల రవితేజ, దుబాసి రమేశ్, రాజు, సంతోష్, నరేశ్ పాల్గొన్నారు.

టీచర్ కొలువుకు మహిళా కానిస్టేబుల్

కాటారం : స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న గడిపెల్లి తేజశ్రీ టీచర్ కొలువుకు ఎంపికయ్యారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో జగిత్యాల జిల్లా నుంచి ఎస్టీటీ విభాగంలో 65వ ర్యాంకు సాధించి టీచర్ ఉద్యోగం పొందారు.